క్లుప్తంగా

తోలుబొమ్మలాటలో రేపు శిక్షణ

బోట్‌క్లబ్: తోలుబొమ్మలాట కళాకారులకు ఈ నెల 10న స్థానిక ఎస్‌ఎఫ్‌సీఎల్‌రోడ్డులోని సత్కళావాహినిలోని శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ సంస్థ నిర్వాహకులు ఈవీ కృష్ణమాచార్యులు శుక్రవారం తెలిపారు. కేంద్రప్రభుత్వ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ సభ్యురాలు ఎస్పీ భారతి ఈ శిక్షణను ప్రారంభిస్తారన్నారు.

వేంకటేశ్వరస్వామికి జన్మనక్షత్ర పూజలు



యండమూరులో వేంకటేశ్వరస్వామికి జన్మ నక్షత్ర పూజలు, వ్రతాలు చేస్తున్న భక్తులు

కరప: మండలం యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి జన్మనక్షత్రం శ్రవణం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు పెద్దింటి సీతారామం భక్తులతో వేంకటేశ్వర వ్రతాలు నిర్వహించారు. భక్తుడు శీలం శ్రీనివాస్ ఆలయానికి వాటర్ కూలర్‌ను బహూకరించగా ఈఓ పీఎస్ఆర్ సూర్యనారాయణరాజు దానిని ప్రారంభించారు. అలాగే మండలంలోని పలు ఆలయాల్లో స్వామి వారికి జన్మనక్షత్ర పూజలు చేశారు.

నేడు, రేపు కూడా ఆస్తి పన్నుల వసూలు



కమిషనర్ వెంకటరావు

కాకినాడ: పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం సెలవు రోజులైనప్పటికీ శని, ఆదివారాల్లో కూడా పన్నులను స్వీకరిస్తామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె. వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. సినిమా రోడ్‌లోని పాత మున్సిపల్ కార్యాలయంతో పాటు, అన్ని సచివాలయాలలో పన్నులు స్వీకరిస్తామన్నారు. ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులకు సంబంధించి పాత బకాయిలపై వడ్డీ రాయితీ ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అందువల్ల పాత, ప్రస్తుత ఆర్థిక సంవత్సర పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బకాయిలు చెల్లించాలని కమిషనర్ కోరారు.

చికిత్స పొందుతూ తాపీమేస్త్రి మృతి

కరప: పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన తాపీమేస్త్రి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఏఎస్ఐ జి.ప్రసన్నకుమార్ తెలిపిన కథనం మేరకు గ్రామానికి చెందిన చక్కపల్లి పద్దరాజు (43) తాపీపని చేస్తుంటాడు. మద్యానికి బానిసైన పద్దరాజు జీవితంపై విరక్తిచెంది ఈ నెల ఒకటో తేదీన కరప శ్మశానవాటికలో మద్యంలో పురుగు మందు కలుపుకొని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారకస్థితిలో ఉన్న అతనిని చికిత్స కోసం కాకినాడ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

కాకినాడలో పోలీసు కవాతు

కాకినాడ క్రైం: కాకినాడలో పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ సుమంత్ ఆధ్వర్యంలో పారామిలిటరీ దళాలు శుక్రవారం కవాతు నిర్వహించాయి. పీఎస్ పరిధిలో గణేష్ కాలనీ, రాజీవ్ గృహ కల్ప, దుమ్ములపేట, తారకరామ నగర్ ప్రాంతాల్లో నిర్వహించిన కవాతు సందర్భంగా సీఐ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఎటువంటి భయాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

13న ప్రధాని మోదీతో వర్చువల్‌గా ముఖాముఖి

కాకినాడ సిటీ: ప్రధానమంత్రి సూరజ్ ప్రోగ్రాం కింద లబ్ధిపొందిన లబ్ధిదారులతో 13వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోడీ వర్చువల్ విధానంలో ముఖాముఖి సమావేశం అవుతారని జిల్లా షెడ్యూల్ కులాల సహకార సంఘం లిమిటెడ్ కార్యనిర్వాహక సంచాలకులు జె సత్యవతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఎన్ఎస్ఎఫ్‌డీసీ ఆర్థిక సంస్థ ద్వారా సహాయం పొందిన ఎస్సీ స్వయం ఉపాధి లబ్ధిదారులు తదితరులతో వర్చువల్‌గా సమావేశమవుతారన్నారు.

టీడీపీ రూరల్ కో ఆర్డినేటరుగా సత్యనారాయణమూర్తి

కాకినాడ రూరల్: టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ కో ఆర్డినేటరుగా పిల్లి సత్యనారాయణమూర్తి, కో కోర్డినేటరుగా కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ)నియమితులయ్యారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం తెలియజేశారు.



సర్పవరం గ్రామోత్సవంలో రథంపై భవానీ సమేత నీలకంఠేశ్వరస్వామి




సూర్యారావుపేటలో రామలింగేశ్వర స్వామికి రుద్రాభిషేకం



కరపలోని పర్వత వర్ధినీదేవి సమేత రామలింగేశ్వరస్వామికి పూజలు



భానులింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకం



అరట్లకట్టలోని మల్లేశ్వరస్వామి

సర్వం హరనామ స్మరణం



సర్పవరంలో భవానీ సమేత నీలకంఠేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు తదితరులు



హరిహర ఆరాధన సంఘం ఆధ్వర్యంలో పార్థివ లింగాలకు అభిషేకాలు చేస్తున్న భక్తులు

- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు
- దర్శనం కోసం క్యూకట్టిన భక్తులు
- స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు

బోట్‌క్లబ్: మహాశివరాత్రి పర్వదినమైన శుక్రవారం నగరంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణలతో ఆలయాలు మార్మోగాయి. తెల్లవారుజాము నుంచి ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించేందుకు భక్తులు క్యూ కట్టారు. తెల్లవారు 3 నుంచి ఆలయాల్లో అభిషేకాలు ప్రారంభంకావడంతో భక్తులు అభిషేకాలు నిర్వహించి స్వామి దర్శనం చేసుకున్నారు. పలు ఆలయాల్లో మధ్యాహ్నం వరకూ క్యూలైన్లు కిటకిటలాడాయి. ఆలయాలకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. స్థానిక దేవాలయం వీధిలోని పురాతన భీమేశ్వర ఆలయంలో తెల్లవారు జాము నుంచి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు దాతల సహకారంతో ప్రసాదం పంపిణీ చేసినట్లు ఆలయ కమిటీ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు. స్థానిక రామారావుపేటలోని అన్నపూర్ణసమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని స్వామికి విశేష అభిషేకాలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసారు. స్థానిక సూర్యారావుపేటలో ఉన్న బాలత్రిపురసుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు బంగారం చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులకు ఆలయ పర్సన్ ఇన్‌చార్జి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయంలో భక్తి, సంగీత కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

హరిహరసేవా సమితి ఆధ్వర్యంలో..

స్థానిక రామారావుపేటలోని సౌమ్య ఎన్‌క్లేవ్‌లో హరిహర సేవా సమితి ఆధ్వర్యంలో సామూహిక మహాన్యాస పూర్వక పార్థివ లింగార్చన ఘనంగా నిర్వహించారు. పార్థివలింగానికి పంచామృతాలతో అభిషేకం చేశారు. బండముళ్ల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో అర్చన, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సేవా సమితి అధ్యక్షులు నందమూరి వీరవెంకట వినోద్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది పార్థివ లింగార్చనలో పాల్గొన్నారు. పీఠం గౌరవ అధ్యక్షుడు అరిగెల శ్రీనివాసరావు, రవి గురు స్వామి పీఠం ఉపాధ్యక్షులు అంకంరెడ్డి రామునాయుడు, కార్యవర్గ సభ్యులు పుప్పాల ఉదయభాస్కర్, పబ్బినీడి శ్రీనివాస్, భానోజీరావు పాల్గొన్నారు.

రూరల్ నియోజకవర్గంలో..

కాకినాడ రూరల్: మండలంలోని పురాతన నేమాం శివాలయం, కాకినాడ సూర్యారావుపేట సాగర తీరాన ఉన్న శివాలయాలకు భక్తులు పోటెత్తారు. పండూరు, తిమ్మాపురం, రేపూరు, తూరంగి, సర్పవరం కొవ్వాడ, రమణయ్యపేట ఆర్టీసీ కాలనీ, గోకుల్ గార్డెన్, శ్రీపీఠం, తదితర చోట్ల మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. సర్పవరం జంక్షన్‌లో ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాలు ఏర్పాటు చేశారు. సర్పవరంలోని భవానీ సమేత నీలకంఠేశ్వర స్వామిని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దర్శించుకుని నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆ శివ పరమాత్ముడు ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలన్నారు. ఆయన వెంట గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు పుల్ల చందు, కోటేశ్వరరావు, కొప్పిశెట్టి శివ, ఆలయ కమిటీ సభ్యులు వాసంశెట్టి పోతురాజు, సత్యనారాయణ, ఎస్ఎఫ్‌సీఎల్ మూర్తి, కరప జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, సర్పవరం ఎంపీటీసీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులతో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.



యండమూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో వాటర్‌కూలర్‌ను ప్రారంభిస్తున్న ఈఓ

కరపలో ప్రత్యేక పూజలు

కరప: స్థానిక అతిపురాతన పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రధానార్చకులు విలపర్తి శ్రీనివాస్, రాజు అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అర్ధరాత్రి లింగోద్భవ పూజలు చేశారు. ఈఓ కె.తిరుమల రవితేజ శివరాత్రి ఏర్పాట్లను పర్యవేక్షించారు. చినమామిడాడలోని పంచముఖేశ్వర స్వామి ఆలయంలో వంశపారంపర్య ధర్మకర్త మెర్ల వీరయ్యచౌదరి భక్తులకు ఏర్పాట్లు చేయగా, అర్చకుడు చంద్రమౌళి అన్నపూర్ణేశ్వరశర్మ పూజాదికాలు చేశారు. అరట్లకట్టలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామికి అర్చకులు కొంతేటి సూర్యదత్త శివకుమార్ లింగోద్భవ పూజలు చేయగా ఈఓ మోర్త మురళీ వీరభద్రరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పెద్దాపురప్పాడులో ఉమాపార్వతి సమేత రామలింగేశ్వరస్వామికి, నడకుదురులోని బాలాత్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో, గురజనాపల్లిలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి, పెనుగుదురులోని బాలాత్రిపురసుందరి సీతేశ్వరస్వామి, వేళంగిలోని బాలాత్రిపుర సుందరీ సమేత భవానీశంకరస్వామి, వేములవాడ భీమకవి జన్మస్థలమైన వేములవాడలో మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి, వాకాడలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరుడు, కూరాడలోని భద్రకాళీ సమేత వీరేశ్వరుడు, కరపలోని సుబ్రమణ్యేశ్వరాలయంలో, గొర్రిపూడిలో బసవేశ్వరస్వామి ఆలయంలో, ఉప్పలంక శివారు మొండిలోని సంగమేశ్వర స్వామి ఆలయంలో, కొరిపల్లిలోని శివాలయాల్లో పూజలు, అభిషేకాలు చేశారు. వివాహితలు కై లాసగౌరి నోము నోచుకున్నారు. నడకుదురు విఘ్నేశ్వరాలయం వద్ద ఉమామహేశ్వరస్వామికి అభిషేకాలు, సహస్రజ్యోతిర్లింగార్చన చేశారు. చెరువులో మాజీ సర్పంచ్ యాసలపు దుర్గాప్రసాద్ కుటుంబసభ్యులు విద్యుద్దీపాలతో అలంకరించి ఏర్పాటుచేసిన శివలింగం, శివపార్వతులు భక్తులను ఆకట్టుకున్నాయి.

అన్ని రంగాల్లో మహిళలు ముందంజ



శివప్రసన్నకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మహిళలు



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ



జీఎస్టీ జాయింట్ కమిషనర్ సుమతిని సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు శివప్రసన్న
- పార్టీ కార్యాలయంలో మహిళా దినోత్సవం

కాకినాడ: ముందెన్నడూ లేనంతగా మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శివప్రసన్న అధ్యక్షత వహించి మాట్లాడుతూ మహిళలకు సంపూర్ణ రక్షణ కల్పించేలా దిశ చట్టాన్ని తీసుకురావడంతో పాటు చట్టసభల్లోను, పార్టీ పదవుల్లోను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సముచిత ప్రాధాన్యం ఇచ్చారన్నారు. మహిళలకు ప్రత్యేక గుర్తింపు, గౌరవం దక్కేలా అన్ని ప్రభుత్వ పథకాలను మహిళల పేరుతోనే ఇస్తున్నారన్నారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున పార్టీ కార్యాలయానికి తరలి వచ్చి శివప్రసన్నకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, కర్రి శైలజ, మార్కెట్‌కమిటీ మాజీ డైరెక్టర్ కర్రి అనంతలక్ష్మి, పెద్ద సంఖ్యలో మహిళా కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనతో మహిళలు శ్రమించాలి

బాలాజీచెరువు: మహిళలు లక్ష్య సాధనతో శ్రమించి తాము ఎంచుకున్న రంగాలలో ఉన్నత స్థాయికి ఎదగాలని జీఎస్టీ జాయింట్ కమిషనర్ జి.సుమతి పేర్కొన్నారు. లయన్స్‌క్లబ్ కాకినాడ అడ్మిన్‌స్ట్రేటర్ డాక్టర్ జే.మధురవాణి, క్లబ్ అధ్యక్షురాలు సుజాత ఆధ్వర్యంలో శుక్రవారం మహిళ దినోత్సవం సందర్భంగా సుమతిని సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అచ్యుతాంబ, లక్ష్మీ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోను రాణించాలి

బోట్‌క్లబ్: స్థానిక శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం వైభవంగా నిర్వహించారు. డైరెక్టర్ జి.శైలజ ఇనిస్టిట్యూట్‌లో మహిళలను సత్కరించారు. అలాగే నరసన్ననగర్‌లోని పతంజలి యోగా సాధన కేంద్రంలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పద్మావతి, అసోసియేషన్ అధ్యక్షులు నాగేంద్రప్రసాద్, కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ, సభ్యులు ప్రతిభ, మాన్విత పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఇంట మహిళా దినోత్సవం

కాకినాడ: ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ నివాసం వద్ద మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలంతా ఉన్నత స్థానాలకు ఎదగాలని, అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

హర్ దిల్ మే వైఎస్సార్.. హమ్ సబ్ జగన్‌కే సాత్

- కాకినాడలో మైనార్టీల ఎన్నికల ప్రచారం



ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ముస్లిం మైనార్టీ సెల్ ప్రతినిధులు

కాకినాడ: వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో 'హర్ దిల్ మే వైఎస్సార్- హమ్ సబ్ జగన్‌కే సాత్' పేరిట శుక్రవారం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. నగర మైనార్టీసెల్ అధ్యక్షుడు ఖాలిద్ బిన్ వలీ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీలు నివసించే ప్రాంతాలకు వెళ్లి ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ఎన్నికల ప్రచారం చేశారు. స్థానిక రామకృష్ణారావుపేట జెండా ప్రాంతం నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వలీ మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్ల వల్ల ఎంతో మంది ముస్లింలు ఉన్నత చదువులు చదివి మంచిస్థానంలో ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కూడా తండ్రిబాటలో మైనార్టీల సంక్షేమానికి ఎనలేని కృషి చేశారన్నారు. అలాగే కాకినాడలో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి షాదీఖానాలు, ఖబరస్తాన్, మసీదులు అభివృద్ధి వంటి ఎన్నో కార్యక్రమాల ద్వారా రూ.12 కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టారని చెప్పారు. అటువంటి ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలను మరోసారి గెలిపించుకోవాలని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు బాషా, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్ష, కార్యదర్శులు రెహ్మాన్‌ఖాన్, కరీంబాషా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నౌషద్, మదీనా మసీదు అధ్యక్షుడు కుతుబుద్దీన్, మైనార్టీ సెల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన మురుగు



సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లో మురుగు నీరు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని సుంకరపాలెం జంక్షన్‌లో డ్రైనేజీ నీరు రహదారిపై పారుతోంది. హైవే నుంచి ద్రాక్షారామకు వెళ్లే రహదారిలో నిత్యం మురుగు నిలిచి ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్లుగా సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రహదారి చెంతన డ్రైనేజీని నిర్మించారు. అయితే డ్రైనేజీ నిర్వహణ లేక చెత్తా చెదారాలు పెరిగిపోయి నీరు పారని పరిస్థితి నెలకొంది. అక్కడ తీవ్ర దుర్వాసన వెదజల్లుతుంది. అంతేకాకుండా నీరు నిలిచిపోవడంతో అనేకమంది జారిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించాలి.

ఒత్తిడి వదిలితే విజయమే

- ముంచుకొస్తున్న పరీక్షా కాలం
- సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ప్రణాళికతో చదివితే సత్ఫలితాలు

కాకినాడ సిటీ: ఇన్నాళ్లు పాఠశాలలో వార్షిక పరీక్షలు రాసిన పదో తరగతి విద్యార్థులు తొలిసారి బోర్డు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ప్రణాళికతో చదివితే ఒత్తిడిని జయించి మంచి మార్కులు సాధించవచ్చని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలు 18వ తేదీన ప్రారంభం కానున్నాయి. భారంగా భావించే ఆంగ్లం, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించాలంటే ఉపాధ్యాయులు ఇచ్చిన సలహాలు, సూచనలు పాటిస్తే సరిపోతుంది.

ఇష్టంతో చదవాలి

పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల్లోనైతే రెండు, మూడు సార్లు కూడా పరీక్షలు జరిగాయి. ఆయా పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చిన సబ్జెక్టులలో బట్టీ పట్టడం కాకుండా అవగాహన కలిగించుకుంటే మంచి మార్కులు సాధించవచ్చని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.


ఒత్తిడిని జయించాలి

బోర్డు పరీక్షలకు తొలిసారి హాజరయ్యే విద్యార్థులు ఒత్తిడిని జయించాలి. మంచి ఫలితాలొస్తాయన్న నమ్మకంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సూచనలను పరీక్షల్లో అమలు చేయాలి. ప్రశాంతం వాతావరణంలో ఉదయం 5 గంటలకే లేచి చదివితే మంచిది. అలాగే సబ్జెక్టులోని కీలకం అంశాలను ఎప్పటికప్పుడు పాయింట్ల వారీగా నోట్సు రాసుకుంటే ఎంతో ఉపయోగం ఉంటుంది.



పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు


ప్రశ్నపత్రం క్షుణ్ణంగా చదవాలి



విద్యార్థులు తొలుత ప్రశ్నపత్రాన్ని క్షుణ్ణంగా చదవాలి. ప్రతి లెక్కలో కనుగొనాల్సిన అంశాలు, దాని సూత్రాలను ఎంచుకుంటూ పరీక్షరాయాలి. తద్వారా ప్రతి ప్రశ్నకు కనీస మార్కులు సాధించొచ్చు. మొత్తం 100 మార్కుల ప్రశ్నాపత్రంలో 50 శాతం ప్రశ్నలు సులభంగా, 30 శాతం ప్రశ్నలు మధ్యస్తంగా, 20 శాతం ప్రశ్నలు ఆలోచనాత్మకంగా ఉంటాయి. వీటిలో ప్రతి ప్రశ్నకు శ్రద్ధగా చదివి అర్థం చేసుకుంటే సులభంగా పరీక్ష రాయొచ్చు.

– టి.గంగా శ్యామల, గణిత ఉపాధ్యాయురాలు, జెడ్పీ ఉన్నత పాఠశాల, తూరంగి


ఏకాగ్రత అవసరం



ప్రతి విద్యార్థి సైన్స్ సబ్జెక్టు విషయమై పాఠ్య పుస్తకంతో పాటు అభ్యాస దీపికపై పట్టు సాధించాలి. సైన్స్‌లో బొమ్మలు చక్కగా గీసి, భాగాలను గుర్తించడాన్ని ప్రాక్టీస్ చేయాలి. మూలకాల ఆవర్తన పట్టికను చక్కగా అవగాహన చేసుకోవాలి. ప్రతి రోజు సమయపాలన పాటిస్తూ అర్థవంతంగా చదువుకోవాలి. పూర్తి సమాచారంతో జవాబులు రాయడంపై శ్రద్ధ వహించాలి. అన్ని పాఠ్యాంశాలను చదువుతూనే అతి ముఖ్యమైన అంశాలపై మరింత ఏకాగ్రత కనబర్చాలి. మొదటి ఆరు పాఠ్యాంశాలపై పట్టు సాధిస్తే మంచిది.

– టీపీ సుభావల్లీ, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు, జెడ్పీ ఉన్నతపాఠశాల, తూరంగి

ప్రణాళిక ముఖ్యం



ప్రతి విద్యార్థికి పరీక్షల సమయంలో ప్రణాళిక ముఖ్యం. ప్రతి సబ్జెక్టుకు కొంత సమయం కేటాయించాలి. ఆ సమయంలో ప్రణాళికాయుతంగా సబ్జెక్టుల్లోని కీలకాంశాలను క్షుణ్ణంగా చదవాలి. సోషల్‌లో మ్యాప్ పెయింటింగ్, మ్యాప్‌లోని వివిధ విభాగాలను గుర్తించడం కీలకం. పరీక్షలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాసేలా ప్రయత్నం చేయడం ద్వారా మంచి మార్కులు సాధించొచ్చు.

– ఎ. మదీనా బాషా, సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుడు, జెడ్పీ ఉన్నత పాఠశాల, తూరంగి

ప్రశ్న పత్రంపై అవగాహన అవసరం



విద్యార్థులు ప్రశ్న పత్రంపై ముందుగా అవగాహన తెచ్చుకోవాలి. పార్ట్-ఏ, పార్ట్-బీలో వచ్చే ప్రశ్నలు, మార్కులు, పేరాలు సమయోచితంగా రాయాలి. కొన్ని ప్రశ్నల్లో చార్ట్ ఆధారంగా జవాబులు రాయాల్సి ఉంటుంది. ఇంగ్లిష్‌లో గ్రామర్ అత్యంత కీలకం. జవాబుల్లో తప్పులు లేకుండా చూసుకోవాలి.

– తానీషా వలీబాబా, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు, జెడ్పీ ఉన్నత పాఠశాల, తూరంగి

సంపద కేంద్రాల తనిఖీ

పెద్దాపురం: మండలంలోని సంపద తయారీ కేంద్రాల వద్ద అసాంఘిక చర్యలకు పాల్పడే వ్యక్తులపై చర్యలు తప్పవని ఎస్‌డబ్ల్యూపీసీ రిసోర్స్ పర్సన్ జి.రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని వడ్లమూరు, గోరింట, దివిలి, చంద్రమాంపల్లి, తాటిపర్తి గ్రామ పంచాయతీల్లోని సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై శుక్రవారం ఆయన మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్‌తో కలసి తనిఖీలు చేశారు. ఆయా కేంద్రాల వద్ద డంపింగ్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పంచాయతీ సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చెత్త రోడ్లపై లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. షెడ్ నిర్మాణాలకు అవసరమైన నిధుల కోసం తన వంతు కృషి చేస్తానని ఈఓపీఆర్డీ రాజశేఖర్ తెలిపారు. వారి వెంట ఎఫ్‌టీసీ టీఏ గణేష్, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

రథోత్సవానికి రంగం సిద్ధం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో బాలత్రిపుర సుందరి, కుమారారామ భీమేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలల్లో భాగంగా శనివారం రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు రథాన్ని పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. మధ్యాహ్నం బ్యాండ్ మేళాలు, బాణసంచా కాల్పులు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనల మధ్య రథం గాంధీ చౌక్ సెంటర్ నుంచి మళ్లీ అక్కడి వరకు సాగనుంది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు రథోత్సవ కమిటీ తెలిపింది.

రేపు కుడుపూడికి సత్కారం

తాళ్లరేవు: ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణను ఈ నెల 10న ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సత్కరించనున్నట్లు విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, ఎండీయూ డబ్ల్యూఏ అధ్యక్షుడు పెయ్యల రమేష్ తెలిపారు. సుంకరపాలెం జాతీయ రహదారిలోని కాపు కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.